పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తం

- 22 పంచాయతీలకు 15 మందే కార్యదర్శులు
- పెరిగిన పని భారం



అంగలూరు గ్రామ సచివాలయం

గుడ్లవల్లేరు: గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. గుడ్లవల్లేరు మండలంలో 22 పంచాయతీలకు 15 మంది మాత్రమే గ్రామ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ కార్యదర్శుల్లోనే కొందరిని ఖాళీగా ఉన్న గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియమించారు. అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారికి పని భారం పెరిగిపోయింది.

మొండికేస్తున్న పనులు

కొన్ని పంచాయతీల్లో సిబ్బంది పోస్టులు కూడా భర్తీ కాకపోవటంతో పనులు మొండికేస్తున్నాయి. కనీసం ఫైల్ అందించేందుకు అటెండరు పోస్టులను కూడా కొన్ని చోట్ల భర్తీ చేయని పరిస్థితి ఏర్పడింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి పన్నుల వసూళ్ల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యదర్శులు హాజరై పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారు.

ఖాళీలను భర్తీ చేయకనే..

పంచాయతీ కార్యదర్శుల ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని పంచాయతీల్లో డోకిపర్రుకు గుడివాడ రూరల్ మండలం శేరీ దింటకుర్రు కార్యదర్శి, వెణుతురుమిల్లికి వేమవరం కార్యదర్శి, గాదేపూడికి వడ్లమన్నాడు కార్యదర్శి, పోలిమెట్లకు అంగలూరు కార్యదర్శి, విన్నకోటకు కూరాడ కార్యదర్శి, పెంజెంద్రకు కొతవరం కార్యదర్శి ఇన్‌చార్జి కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కట్టవానిచెరువు కార్యదర్శి సెలవులో ఉండటంతో శేరీ దగ్గుమిల్లి కార్యదర్శి ఇన్‌చార్జిగా అదనపు విధులను నిర్వహిస్తున్నారు. అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవటంతో పాలన కుంటుపడుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కార్యదర్శులకు అదనపు భారం



మండలంలోని 15 పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులకు పని భారంగానే మారింది. 22 పంచాయితీల్లో 15 కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. అదనపు బాధ్యతలు అప్పగించటంతో వారికి పని భారం అధికమైంది. ఆ బాధిత కార్యదర్శులు ఏ గ్రామానికీ న్యాయం చేయలేక సతమతమవుతున్నారు.

– కోటప్రోలు నాగు, సర్పంచ్, చినగొన్నూరు, గుడ్లవల్లేరు మండలం

రిక్రూట్ చేయాల్సి ఉంది



మండలంలో గ్రామ కార్యదర్శుల కొరత ఉన్నమాట వాస్తవం. ఆ ఖాళీలను రిక్రూట్ చేయాల్సి ఉంది. అయితే ఆ నియామకాలపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కావాల్సి ఉంది. కనీసం బదిలీలపై అయినా కార్యదర్శులు రావాలి. లేకపోతే పదోన్నతులపై వచ్చే వారితో అయినా ఈ ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది.

– టి.విజయసారథి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, గుడ్లవల్లేరు

ఉప ముఖ్యమంత్రికి పామర్రు సమస్యలపై వినతి


ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తూ సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. పెనమలూరు నియోజకవర్గంలోని గొడవర్రు నుంచి పామర్రు నియోజకవర్గంలోని రొయ్యూరు వెళ్లే రహదారిని రూ.3.75 కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ పనుల నాణ్యత పర్యవేక్షించేందుకు వచ్చిన డెప్యూటీ సీఎంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని మొవ్వ మండలం కాజలోని బ్రెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, పెదపారుపూడి మండల యలమర్రు నుంచి చినపారుపూడి వెళ్లే బ్రిడ్జి, తోట్లవల్లూరు మండలం రొయ్యూరు శివారు ఏనుగులకోడు మురుగు కాలువపై వంతెనలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై డెప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, బీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు


మంటాడలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్


జమీగొల్వేపల్లిలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్‌రాజా


గుడ్లవల్లేరులో సెమీ క్రిస్మస్ వేడుకలు

పమిడిముక్కల: మంటాడ ఎస్సీ కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ జి.ఒనీశం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం

గుడ్లవల్లేరు: క్రీస్తు మార్గం ఆచరణీయమని స్థానిక సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ అన్నారు. స్థానిక పాఠశాలలో ఆయన సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బాలలు ధరించిన క్రిస్మస్ దుస్తులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శలు ఇచ్చారు.

పామర్రులో..

పామర్రు: ఏసుక్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని కురుమద్దాలి ఆర్సీఎం చర్చి, రిమ్మనపూడి శివారు జెపి గూడెం సీఎస్ఐ చర్చి, అడ్డాడలోని సీబీసీఎన్‌సీ చర్చి, జమీగొల్వేపల్లిలోని పలు చర్చిలలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఎంపీటీసీ సభ్యుడు అరవింద్, నాయకులు వెంకటేశ్వరరావు, కృష్ణారావు, పాస్టర్లు యేసుదాసు, కురుమద్దాలి సర్పంచ్ విజయభారతి పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ప్రార్థన మందిరాల ముస్తాబు


ముస్తాబైన కొరగుంటపాలెం ఇమ్మానియేలు ప్రార్థన మందిరం

ముదినేపల్లి రూరల్: క్రిస్మస్ వేడుకల బుధవారం ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని పలు ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు, బెలూన్లతో ప్రార్థన మందిరాలను అందంగా అలంకరించారు. కొరగుంటపాలెం ఇమ్మానియేలు, వణుదుర్రు సీఎస్ఐ న్యూజెరుసలేం, ముదినేపల్లి ఆర్సీఎం, బొమ్మినంపాడు సీఎస్ఐ, సింగరాయపాలెం ప్రేమస్వరూపిణి ప్రార్థన మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేశారు. ఇదిలా ఉండగా పలు ప్రార్థన మందిరాల్లో ఆదివారం రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలకు సంబంధించి ప్రార్థనలు ప్రారంభించారు. విశ్వాసులు పలువురు ప్రార్థన మందిరాలకు చేరుకుని క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్నారు.

శ్మశాన వాటికలో ముళ్ల పొదల తొలగింపు

కైకలూరు: వైఎస్సార్ నగర్ శివారు దళిత క్రైస్తవ శ్మశాన వాటికలో గుబురుగా పెరిగిన ముళ్ల పొదలను కూలీల సాయంతో సోమవారం తొలగించారు. పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వీరాబత్తిన సుధ మాట్లాడుతూ ఇటీవల పొక్లెయిన్‌తో ముళ్ల కంపలను తొలగించామన్నారు. మూడు రోజులుగా కూలీలతో మిగిలిన ముళ్ల కంపలను తొలగించినట్లు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా సమాధుల వద్దకు వచ్చే కుటుంబీకులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సూరగాని కిరణ్, కమిటీ సభ్యుడు పానేం కిషోర్, గొంతుపులి నరేష్, గొంతుపులుగు సతీష్, కర్రి డేవిడ్ రాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



నిమ్మకూరు(పామర్రు): పీహెచ్‌సీ ద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలను అందించాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడ్వైజరీ కమిటీ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ పాల్గొని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసరమైన మందులను ఎప్పుడికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రఘురాం, యశ్వంత్, చరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు

పమిడిముక్కల: మండలంలోని కపిలేశ్వరపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ఎల్విన్ జోన్స్ జయంతిని ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. లయన్స్ ప్రతినిధులు ప్రకాశరావు, జగదీష్, సాయిదత్ పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

కైకలూరు: ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రతిఒక్కరికీ దక్కాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు అన్నారు. ఆచవరం పంచాయతీ ఆనందరావుపేట సీఎస్ఐ చర్చి మూడో వార్షికోత్సవం కార్యక్రమాల్లో ఆయన సోమవారం పాల్గొన్నారు. క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ దండే సైమాన్, గ్రామ పెద్దలు ఏసేబు, ఏసుబాబు, మార్కు, పెంటయ్య పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి


బాపూజీనగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గుడివాడరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బాపూజీ నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఆర్సీపీ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా చంద్రపాల్, కేవీపీఎస్ నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, సింగవరపు రాంబాబు, ఏసుపోగు యేసయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రేపాని కొండ, వెంకటేష్ పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కలిదిండి(కైకలూరు): కలిదిండి పంచాయతీ కార్యాలయం సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొండంగి గ్రామానికి చెందిన మోషే అనే వ్యక్తి నుంచి 51 క్వార్టర్ మద్యం సీసాలు సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా మొక్కలు నాటాలి


మల్లేశ్వరస్వామి ఆలయంలో మొక్కలు నాటుతున్న సమితి సభ్యులు

మండవల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమ స్ఫూర్తితో స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ ధర్మ సమితి ఆధ్వర్యంలో సోమవారం పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈఓ దివ్యశ్రీ, గ్రామస్తులు హిందూ ధర్మసమితి సభ్యులను అభినందించారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



మండవల్లి: మండవల్లిలో గుడివాడ–భీమవరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గాంధీ ఆశ్రమం వరకు రూ.11 లక్షల ఎస్ఆర్‌జీఈఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను స్థానిక పంచాయతీ సెక్రెటరీ సాయి ప్రదీప్ సోమవారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన వారిలో ఉన్నారు.

భవానీలకు స్వీట్ల పంపిణీ



గుడివాడరూరల్: విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు గుడివాడ మీదుగా పాదయాత్రగా వెళుతున్న భవానీలకు శ్రీకృష్ణ యాదవ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. బంటుమిల్లి రోడ్డులోని దుర్గశ్యామల స్వీట్‌షాప్ వద్ద జొన్నలగడ్డ వేణుబాబు, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ సహకారంతో పాదయాత్రగా విజయవాడ వెళుతున్న 300మంది భవానీలకు వాటిని అందచేశారు. కార్యక్రమంలో అర్చకుడు యడవల్లి విజయ్‌కుమార్, ఇంద్రకీలాద్రి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు జోగా బాలకృష్ణ, జాజుల తాతారావు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బందికి దుస్తులు అందజేత



కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు పంచాయతీలోని 11 మంది కాంట్రాక్టు స్వీపర్లకు, చెత్త నుంచి సంపద తయారీ షెడ్ వర్కర్లకు పంచాయతీ నిధులు రూ.16,500లతో రెండేసి జతల దుస్తులను సోమవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శి ఎంఎస్ఎస్ మూర్తి, బిల్ కలెక్టర్ శివనాగులు, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ కృష్ణ పాల్గొన్నారు

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు



మండవల్లి: యూటీఎఫ్ మండల శాఖ తరఫున మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 140 మంది విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థి, అయ్యవారిరుద్రవరం ఎంపీపీ స్కూల్ హెచ్ఎం సీహెచ్ పిచ్చోడు ఆర్థిక సాయంతో యూటీఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్లు అందజేశారు. ఎంఈఓ డి.రామారావు విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఆర్ రవికుమార్, నాయకులు జి.రమేష్, రవిశంకర్, హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ఆనంద్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి మరమ్మతులు పూర్తి



కైకలూరు: పామర్రు –దిగమర్రు జాతీయ రహదారిలో అసంపూర్తిగా ఉన్న మరమ్మతు పనులను ఎట్టకేలకు కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. కైకలూరు మండలం గోనెపాడు నుంచి భుజబలపట్నం, పల్లెవాడ నుంచి ఆలపాడు గ్రామాల మధ్య జాతీయ రహదారి విస్తరణ, మరమ్మతు పనులు ఆలస్యమయ్యాయి. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులను పూర్తి చేయించారు.

సేవ చేయడమే ధ్యేయం



మొవ్వ: యేసేజబాబు సంస్థ ద్వారా పేదలకు సేవ చేయడమే తమ ధ్యేయమని కృష్ణా జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు, పాస్టర్ వేమూరి పరిశుద్ధరాజు పేర్కొన్నారు. మొవ్వ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ సందర్భంగా తన భార్య అమ్మినితో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. మొవ్వలోని మూడు ప్రభుత్వ హాస్టల్స్ విద్యార్థులతోపాటు పేదలకు 3,000 మందికి పైగా బకెట్లు పంపిణీ చేశామన్నారు. త్వరలో ప్రతి నెలా 200 మంది వృద్ధులకు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రామానుజన్ జీవితం విద్యార్థులకు ఆదర్శం


రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

గుడివాడరూరల్: గణిత పితామహుడు రామానుజన్ జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శమని ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జే.ఎస్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఎన్ఆర్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానుజన్ తన జీవితంలో ప్రతిదానినీ అంకెలు, సంఖ్యలతో చూసేవారన్నారు. ఏది మాట్లాడినా, ఏమి చేసినా అందులో లాజికల్ కోణాలు అందరినీ ఆశ్చర్యపర్చేవన్నారు. అనంతరం రామానుజన్ జీవిత చరిత్ర, గణిత విభాగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో గణిత విభాగాధిపతి కె.రమాదేవి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు


లింగవరంలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్


కొతవరం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ లోకరాజు


మండవల్లిలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాల్


ముళ్లపూడి సదస్సులో మాట్లాడుతున్న నోడల్ అధికారి

గుడివాడరూరల్: రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని లింగవరంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై ప్రజలనుంచి 10 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూపరమైన సేవలను ప్రజలకు సులువుగా అందించేందుకు సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. సదస్సుల్లో రైతులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొతవరంలో..

గుడ్లవల్లేరు: కొతవరంలో సోమవారం నిర్వహించిన సదస్సులో అర్జీదారులు వినతులను అధికారులకు అందించారు. అర్జీలను పరిశీలించి, సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.లోకరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కే గోపాల్ అన్నారు. మండలంలోని సింగనపూడిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సులో వివిధ సమస్యలపై ఆరు అర్జీలు అందాయన్నారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్ఓ పసుపులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్, తహసీల్దార్ జెఎస్ సుభానీ పేర్కొన్నారు. మండలంలోని దాకరం, కోడూరులో సోమవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని మండల నోడల్ అధికారి ఎం.ఫణి ధూర్జటి రైతులకు సూచించారు. మండలంలోని ముళ్లపూడిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 11 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. రీసర్వే డీటీ యేసుపాదం, వైస్ ఎంపీపీ మహేష్ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

వింజరంపాడు(పెదపారుపూడి): మండలంలోని వింజరంపాడు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వై.రంగారావు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడాతాయన్నారు. సరిహద్దు గొడవలు తదితర సమస్యలకు వెంటనే పరిష్కారం దొరుకుతుందన్నారు.

చిత్రపటాలు అందజేత


చిత్రపటాలను అందజేస్తున్న గ్రామస్తులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి పంచాయతీ కార్యాలయానికి సోమవారం నాటి, నేటి గ్రామ సర్పంచుల చిత్రపటాలను వారి కుటుంబ సభ్యులు అందజేశారు. గ్రామ పంచాయతీగా ఏర్పడిన నాటి నుంచి సర్పంచులుగా పనిచేసిన పసుమర్తి ఆదినారాయణ, జోశ్యుల శ్రీహరిప్రసాద్, వైకేడీ ప్రసాద్‌రావు, వేదాంతం శ్రీరామ శర్మ, చీకటిమర్ల అంజనాదేవి, పెనుమూడి కాశీ విశ్వనాథం, మద్దాల నాగభూషణం, కందులు జయరాంతో పాటు ప్రస్తుతం సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి చిత్రపటాలను పంచాయతీ కార్యదర్శి కె.పుష్పనాథానికి అందజేశారు.

టిడ్కో గృహాలను అర్హులకు అప్పగించాలి

గుడివాడరూరల్: గుడివాడ సమీపంలోని మల్లాయపాలెం పరిధిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లోని ప్లాట్లను పూర్తిగా లబ్ధిదారులకు అందచేయాలని కాంగ్రెస్ నాయకుడు వద్దాది రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో టిడ్కో గృహాలకు రూ.25 వేలు చొప్పున రెండు డీడీలు మున్సిపాల్టీకి చెల్లిస్తే, అధికారులు రికార్డులను గాలికి వదిలి లబ్ధిదారులు చెల్లించిన డీడీలను చూపించమని ప్రశ్నించడం సరికాదన్నారు.